@netifocusnews @focustv www.netifocusnews.com

TS-18-0006625

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | శుక్రవారం 7, మార్చి, 2025 | పేజీలు: 04

## రేవంత్ బాధ్యతలు తీసుకుంటే అక్కడ
# బీజేపీ గెలిచినట్టే

● ఎనిమిది కుటుంబాల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయి ● వేల కోట్ల ప్రజాధనం వృధా అయ్యింది ● ఈ రెండు నివేదికల అంశంపైన స్పష్టత ఇవ్వాలి ● బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 6:



కరీంనగర్.. నిజామాబాద్.. మెదక్.. ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎక్కడ బాధ్యత తీసుకుంటే అక్కడ బీజేపీ గెలుస్తుందని అన్నారు. రేవంత్ ఎక్కడ అడుగుపెడితే అక్కడ కాంగ్రెస్ భస్మమే అని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల సమయం లో మహబూబ్‌నగర్, మల్కాజిగిరి బాధ్యత తీసుకుంటే.. ఆయా స్థానాల్లో బీజేపీ గెలిచిందని గుర్తుచేశారు. హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచార బాధ్యత తీసుకుంటే అక్కడ కూడా బీజేపీనే గెలిచిందని అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు స్టార్ క్యాంపెయినర్‌గా వెళ్తే అక్కడ కూడా బీజేపీనే గెలిచిందని పేర్కొన్నారు. కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఎప్పుడూ లేనివిధంగా ముఖ్యమంత్రి హోదాల క్యాంపెయిన్ చేశారని చెప్పారు. కానీ అనూహ్యంగా అక్కడ కూడా బీజేపీ అభ్యర్థినే విజయం సాధించారని.. ఇందులో మర్మం ఏమిటో అని సందేహం వ్యక్తం చేశారు. ఈ మర్మం "ఛడే భాయ్ ఈ చోటే భాయ్" కే తెలియాలని అన్నారు.

## బీసీలకు 42 శాతం
# రిజర్వేషన్లు

## ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

● ఎస్సీ కులాల వర్గీకరణ ముసాయిదా బిల్లుకు ఆమోదం ● మార్చి10 తర్వాత అసెంబ్లీ సమావేశాలు ● మూడుచింతల పల్లి, ఎల్లంపేట్, అలియాబాద్ మున్సిపాలిటీలలోకి ● ములుగు సహా పలు గ్రామాలు మున్సిపాలిటీలుగా ప్రమోషన్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 6:

ఎస్సీ వర్గీకరణ ముసాయిదా బిల్లుకు కేబినెట్ ఆమోదంతెలిపింది. న్యాయ పరమైన చిక్కులు లేకుండా ముసాయిదా బిల్లుకు తుదిమెరుగులు దిద్దాలని సమావేశంలో ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందుకోసం న్యాయనిపుణుల సలహాలు తీసుకొని తుది మెరుగులు దిద్దాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. వీటితో పాటు 33 స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులు, 10,950 గ్రామాలకు అధికారుల నియమానికి కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. 10,950 గ్రామాల్లో క్షేత్రస్థాయి అధికారులను నియమించనుంది. కొత్త డివిజన్లు, మండలాలకు 217 పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది.

హెచ్‌ఎండీఏను కూడా భారీగా విస్తరించాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. 11 జిల్లాలు, 104 మండలాలు, 1355 గ్రామాలతో హెచ్‌ఎండీఏ విస్తరించనున్నట్లు చెప్పారు. మహిళల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న పొంగులేటి, రాష్ట్రంలో కోటి మంది మహిళలను లక్షాధికారులుగా చేయాలని కేబినెట్ నిర్ణయించినట్లు ప్రటించారు. రాష్ట్రంలోని మహిళా సంఘాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తేనున్నారు. ఈ సంఘాల్లో సభ్యత్వానికి వయో పరిమితిని 15 నుంచి 65 ఏళ్లుగా నిర్ణయించినట్లు తెలిపారు. టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బోర్డు ఏర్పాటు చేయాలని మంత్రిమండలి నిర్ణయించింది.

(మిగతా 2లో..)



## తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయం

● 10,950 విలేజ్ లెవెల్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి ఆమోదం ● సిఎంతో ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి భేటీ

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 6:

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం దాదాపు ఆరు గంటలపాటు సుదీర్ఘంగా సాగింది. ఈ భేటీలో మంత్రిమండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎస్సీ వర్గీకరణ ముసాయిదా బిల్లుకు తెలంగాణ క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ఫ్యూచర్ సిటీ బోర్డుకు సైతం మంత్రిమండలి ఆమోదం తెలిపింది. అలాగే నదీ జలాల అంశంపై ప్రత్యేక కమిటీ వేయాలని నిర్ణయిం చింది. ఉగాది నుంచి 'భూ భారతి' అమలు చేయాలని తీర్మానం చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర యువతకు మంత్రిమండలి శుభవార్త చెప్పింది. 10,950 విలేజ్ లెవెల్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది. కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాలకు 217 పోస్టులు, 10 జిల్లా కోర్టులకు 55 పోస్టుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇదిలావుంటే ఉదయం సిఎ రేవంత్‌ని టీచర్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు. ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని చెప్పారు.

## రాష్ట్ర అభివృద్ధికి కిషన్ రెడ్డి
# సహకరించట్లేదు

● అంబర్‌పేటలో రూ.4.90 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం ● కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పరుగులు ● మంత్రి పొన్నం ప్రభాకర్

2






## రూ.15,00 కోట్లతో
# భారీ పెట్టుబడి

● ప్రపంచంలోనే అతిపెద్ద కళ్లజోడుల ప్లాంట్, 2వేల మందికి ఉద్యోగావకాశాలు ● 50 ఎకరాల్లో విశాలమైన తయారీ యూనిట్: ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు




హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 6:

తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేస్తూ, రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలను అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం నెలకొన్నదని, పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలా సహకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ "తెలంగాణ రైజింగ్" లో భాగస్వామ్యం (మిగతా 2లో..)



## త్వరలో అందుబాటులోకి
# ఆధునిక రహదారి

● నాలుగు లైన్ల రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన
● ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

2

## బిల్లులతోనే
# 3 న్యాయం



● కాంగ్రెస్ కుట్ర, బీసీల హక్కులపై ఆట ● బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు తప్పనిసరి ● బీసీల ఐక్యతే బలమైన ఆయుధం ● ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 6:

తెలంగాణ కేబినెట్ సమావేశం నేపథ్యంలో ఎమ్మెల్సీ కవిత గురువారం మీడియాతో మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్లను పెంచే లక్ష్యంతో ప్రభుత్వం మూడు వేర్వేరు బిల్లులు ప్రవేశపెట్టాలని సూచించారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్ల పెంపుకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని ఆమె అభిప్రాయపడ్డారు. కవిత తెలిపిన ప్రకారం, విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కేంద్ర-రాష్ట్ర ఉమ్మడి జాబితాలోకి వస్తాయి. అయితే, స్థానిక సంస్థల్లో (మిగతా 2లో..)



## కవితకు దొరహంకారం
# తగ్గలేదు

2

● బీజేపీని, ఈసీని విమర్శించే నేతలకు ఎన్నికల ఫలితాలు గుణపాఠం ● బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి



## రైజింగ్ కాదు..
# ఫాలింగ్

● జీఎస్టీ, వాహన విక్రయాల్లో నెగటివ్ వృద్ధి ● పాలనపై శ్రద్ధ పెట్టండి ప్రజలకు క్షమాపణ చెప్పండి ● ఆర్థిక వ్యవస్థ కుదేలవుతోంది: హరీశ్ రావు

2

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

(మొదటి పేజీ తరువాయి..)

**తెలంగాణ కేబినెట్ ఎస్సీ వర్గీకరణ** ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో నిర్వహించిన కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, బిల్లు న్యాయపరంగా బలంగా ఉండేలా న్యాయ నిపుణుల సూచనలు తీసుకోవాలని, ఏ విధమైన న్యాయపర చిక్కులు లేకుండా తుది మెరుగులు దిద్దాలని సూచించారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ దశాబ్దాలుగా చర్చనీయాంశంగా ఉంది. రాష్ట్రంలో 59 ఎస్సీ కులాలు ఉన్నప్పటికీ, అందరికీ సమాన అవకాశాలు అందడం లేదన్న అభిప్రాయం కొంతకాలంగా వ్యాప్తిలో ఉంది. ప్రస్తుత ఎస్సీ రిజర్వేషన్ల అమలులో కొన్ని కులాలు అధికంగా ప్రయోజనం పొందుతున్నాయి, మరికొన్ని కులాలు వెనుకబడిపోతున్నాయి. ఇందులో ముఖ్యంగా మాదిగలు, దక్కళ్లు, ఇతర వెనుకబడిన ఎస్సీ కులాలు రిజర్వేషన్ పునర్వ్యవస్థీకరణ కోసం పోరాటం చేస్తున్నారు. వీరి వాదన ప్రకారం, ప్రస్తుతం ఉన్న 15% ఎస్సీ రిజర్వేషన్లను అన్ని కులాలకు సమానంగా పంపిణీ చేయడం సాధ్యమవడం లేదని, అందువల్ల వర్గీకరణ ద్వారా సమాన న్యాయం



చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మాల, మాదిగ అనే ప్రధాన ఎస్సీ వర్గాల మధ్య రిజర్వేషన్ ప్రయోజనాల పంపిణీపై వివాదాలు ఉన్నాయి. గతంలో మాదిగల నేత మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మాదిగ వర్గీకరణ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం జరిగింది. ఈ ఉద్యమం ముఖ్యంగా దళిత వర్గీకరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యంగా సాగింది.

మాదిగ వర్గీకరణ ఉద్యమంలో భాగంగా, "ఎస్సీ వర్గీకరణ" అనే భావనకు మరింత బలం చేకూరింది. దీని ప్రకారం, ఎస్సీ కోటాను లోపలి ఉపవర్గాలకు విభజించి, ప్రాతినిధ్యం లేని కులాలకు మరింత అవకాశం కల్పించాలి అనే డిమాండ్ వచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ముసాయిదా రూపొందించేందుకు ముందడుగు వేసింది. ఈ బిల్లును న్యాయపరంగా పరిశీలించి, అన్ని అంశాలను దృష్టిలో ఉంచుకుని తుది ఆమోదానికి పంపే అవకాశం ఉంది. ముసాయిదా రూపకల్పనలో నిపుణుల సూచనలు తీసుకుని, కేంద్ర ప్రభుత్వానికి అర్థమైన ప్రతిపాదనలు పంపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈ నిర్ణయం తెలంగాణ ఎస్సీ వర్గాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. మాదిగ వర్గీకరణ పోరాటం చేస్తున్న వర్గాలు దీనిని స్వాగతిస్తున్నాయి, కానీ మరికొన్ని వర్గాలు ఈ నిర్ణయంపై ఇంకా తమ అభిప్రాయాన్ని వెల్లడించాల్సి ఉంది. భవిష్యత్తులో ఈ బిల్లు ఏ విధంగా అమలులోకి వస్తుందనేది ముఖ్యమైన అంశం. ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ విధానంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం, కేంద్రం స్పందనపై దళిత సంఘాలు, రాజకీయ పార్టీలు గమనిస్తున్నాయి. మార్చి 10 తర్వాత అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ .. బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టనున్నారుమేడ్చల్ జిల్లాలోని మూడుచింతలపల్లి, ఎల్లంపేట్, అలియాబాద్ మండలాలను మున్సిపాలిటీలలో విలీన చేయాలని నిర్ణయించారు.. దీంతో పట్టణ జిల్లాగా మేడ్చల్ మారుతుంది. సెర్ప్, మెప్మా విలీనంకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ములుగుతో పాటు మరికొన్ని గ్రామపంచాయతీలు మున్సిపాలిటీలుగా మారిన నేపథ్యంలో.. గ్రామ పంచాయతీల జాబితా నుంచి ఆ గ్రామాలను తొలగిస్తూ క్యాబినెట్ తీర్మానం చేసింది.

## తెలంగాణ రైజింగ్ కాదు..
# తెలంగాణ ఫాలింగ్

- జీఎస్టీ, వాహన విక్రయాల్లోం నెగటివ్ వృద్ధి
- పాలనపై శ్రద్ధ పెట్టండి ప్రజలకు క్షమాపణ చెప్పండి
- తెలంగాణ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతోంది
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు



హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 6: మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు సీఎం రేవంత్ రెడ్డి పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన మాట్లాడుతూ, "రేవంత్ రెడ్డి గారూ, మీరు తెలంగాణ రైజింగ్ కాదు, తెలంగాణ ఫాలింగ్ చేస్తున్నారని" అన్నారు. గత ఆరేళ్లలో (2021 కరోనా సంవత్సరం మినహా) ఫిబ్రవరిలో జీఎస్టీ ఆదాయ వృద్ధి రేటు ఎప్పుడూ 6% కంటే ఎక్కువగా ఉండేది. అయితే, రేవంత్ రెడ్డి పాలనలో ఈ వృద్ధి కేవలం 1%కే పరిమితమైందని, ఇది కరోనా కాలాన్ని తలపించే స్థితి అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనా వైఫల్యం ప్రజల కొనుగోలు శక్తిపై తీవ్ర ప్రభావం చూపుతోందని హరీశ్ రావు విమర్శించారు. హైడ్రా, మూసీ వంటి అస్పష్టమైన నిర్ణయాలు, అనాలోచిత చర్యల వల్ల 2024 ఆగస్టు తర్వాత రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం గణనీయంగా తగ్గిందని తెలిపారు. 2023 ఏప్రిల్ %-% నవంబర్ మరియు 2024 ఏప్రిల్ %-% నవంబర్ మధ్య కాలంలో వాహన విక్రయాలు -0.8% తగ్గినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయని పేర్కొన్నారు. జీఎస్టీ ఆదాయంలో తక్కువ వృద్ధి రేటు, రిజిస్ట్రేషన్లు, వెహికిల్ టాక్స్‌లో నెగెటివ్ వృద్ధి రేటు వంటి అంశాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వ పరిపాలనలో లోపాలను సూచిస్తున్నాయని హరీశ్ రావు ఆక్షేపించారు. ఇప్పటికైనా సీఎం ప్రజలకు క్షమాపణలు చెప్పి, పాలనపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

# మూడు బిల్లులతోనే న్యాయం

(మొదటి పేజీ తరువాయి..)

రిజర్వేషన్ల అంశం రాష్ట్ర పరిధిలోనే ఉందని స్పష్టం చేశారు. పట్టణ స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో చట్టాన్ని రూపొందించి అమలు చేసిందని గుర్తుచేశారు. ఇదే విధంగా, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధంగా నిర్ణయం తీసుకోవచ్చని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం దీనికి వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు. మూడు అంశాలను ఒకే బిల్లులో కలిపి, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపును అడ్డుకునేందుకు కుట్ర జరుగుతోందని ఆమె ఆరోపించారు. ఒకే బిల్లులో మూడు అంశాలను పొందుపరిస్తే, ఇది న్యాయసంబంధ వివాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. జనాభాలో 50% పైగా ఉన్న బీసీలకు తగిన ప్రాధాన్యం లభించాలని ఆమె డిమాండ్ చేశారు. కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై స్పందిస్తూ, ప్రజాస్వామ్యం కంటే రాజకీయ పార్టీలు గెలిచాయని, కానీ బీసీ అభ్యర్థి ఓడిపోయారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బీసీ లేతర అభ్యర్థులను పోటీలో నిలిపిన కారణంగా బీసీ ఓట్లు చీలిపోయాయని తెలిపారు.

## రాష్ట్ర అభివృద్ధికి కిషన్ రెడ్డి
# సహకరించట్లేదు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 6: అంబర్‌పేట నియోజకవర్గంలో తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా బాగ్ అంబర్‌పేట, నల్లకుంట, బర్కత్‌పురా ప్రాంతాల్లో మొత్తం రూ.4.90 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత విహెచ్, అంబర్‌పేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి రోహిన్ రెడ్డి, ఇతర ప్రముఖ నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, గతంలో బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నదని, నిధుల దుర్వినియోగం వల్ల అభివృద్ధి ఆగిపోయిందని విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, అన్ని రంగాల్లో సమతుల అభివృద్ధిని నిర్దేశించామని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం సహకరించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ ప్రభుత్వానికి ఎలాంటి సహాయం అందించడం లేదని ఆయన ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను మంజూరు చేయడంలో కేంద్రం అంతరాయం కలిగిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రజల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని వివరించారు. ప్రజల సౌకర్యాన్ని మెరుగుపరిచే దిశగా త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను మంత్రికి తెలియజేశారు. వాటిని ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## త్వరలో అందుబాటులోకి ఆధునిక రహదారి

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 6: ముదిగొండ నుంచి వల్లభి వరకు నాలుగు లైన్ల రహదారి అభివృద్ధి పనులకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ, ముదిగొండ పట్టణ పరిధిలో 5 కిలోమీటర్ల మేర ప్రస్తుతం ఉన్న రెండు లైన్ల రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించేందుకు ప్రభుత్వం రూ. 28 కోట్ల ప్లాన్ నిధు లను కేటాయించిందని తెలిపారు. రహదారి విస్తరణతో పాటు డ్రైనేజీ, ఫుట్‌పాత్ నిర్మాణ పనులు కూడా చేపట్ట నున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రోడ్లు-భవనాలు శాఖ ఎస్ఇ హేమలత, ఇఇ యుగంధర్ రావు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను ఓడించేందుకు
# బిజెపితో బిఆర్ఎస్ కుమ్మక్కు

- ఈ రెండు పార్టీల మధ్య లోపాయకారి ఒప్పందం
- మంత్రుల ఘాటు విమర్శలు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 6: ఎమ్మెల్సీ కాంగ్రెస్‌ను ఓడించేందుకు బిజెపి, బిఆర్ఎస్ కుట్ర చేసిందని తెలంగాణ ఐటిశాఖ మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. ఎమ్మెల్సి ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై గాంధీభవన్ లోఆయన మీడియాతో మాట్లాడారు. బిజెపి, బిఆర్ఎస్ కలిసి రంజాన్ గిఫ్ట్ ఇచ్చాయా అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ కలిసి పని చేశాయని బిఆర్ఎస్ బలం అంతా పెట్టి బిజెపికి సపోర్ట్ చేసిందని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిని ఆ రెండు పార్టీలు కలిసి ఓడించాయని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి రంజాన్ గిఫ్ట్ ఇచ్చామని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చానన్నారు. తాము బిజెపికి ఎన్నో గిఫ్టులు ఇచ్చామని, త్వరలోనే రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లడుతూ.. కాంగ్రెస్‌ను ఓడించడానికి భాజపా, భారాస కలిసి పనిచేశాయన్నారు. పట్టభద్రులకు నైపుణ్యాన్ని పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేస్తున్నారని తెలిపారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాజపా, భారాస రెండూ కలిసే కాంగ్రెస్‌ను ఓడించాయని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఎమ్మెల్సీ ఫలితాలపై ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'అభ్యర్థిని పెట్టకుండా భాజపాతో కలిసి భారాస కుమ్మకయ్యిందని అన్నారు. ఈ రెండు పార్టీలు ఒకటే అని తేలిందన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వారిద్దరు ఎవరికి ఓటేశారో చెప్పాలి. తక్కువ ఓట్లతోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోయాం. ఈ ఓటమిపై సమీక్షించుకుంటామని అన్నారు. ఇదిలావుంటే అంబర్‌పేటలో తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. నియోజకవర్గంలో బాగ్ అంబర్‌పేట, నల్లకుంట, బర్కత్‌పురా ప్రాంతాల్లో రూ.4.90 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపి కాంగ్రెస్ సీనియర్ నేత విహెచ్, అంబర్ పేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి రోహిన్ రెడ్డి పలువురు నేతలు, అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడారు?బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని అన్నారు. రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సహకరించట్లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకు కిషన్ రెడ్డి అడ్డొస్తున్నారని పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు.

## ఈఏపీసెట్‌కు
# భారీగా దరఖాస్తులు

- ఐదు రోజుల్లోనే దాదాపు 48,158 మంది అభ్యర్థుల దరఖాస్తుల సమర్పణ

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 6: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2025-26 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్, అగ్రికల్చర్-ఫార్మా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించనున్న ఈఏపీసెట్ 2025కు గత శనివారం నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభమైన సంగతి తెలిసిందే. మార్చి 1వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. అయితే కేవలం ఐదు రోజుల్లోనే ఊహించని రీతిలో దరఖాస్తులు వచ్చాయి. దాదాపు 48,158 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ఈఏపీసెట్ కో కన్వీనర్ ఆచార్య కె.విజయకుమార్ రెడ్డి తెలిపారు. వీరిలో 31,805 మంది ఇంజినీరింగ్, 16,317 మంది అగ్రికల్చర్-ఫార్మసీ, మరో 36 మంది రెండు విభాగాల పరీక్షలు రాసేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కాగా ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఏప్రిల్ 4, 2025వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. రూ.2,500, రూ.5 వేల ఆలస్య రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకున్నవారికి హైదరాబాద్‌లోని జోన్ 4లో మాత్రమే పరీక్షా కేంద్రాలు కేటాయిస్తారని ఇప్పటికే నోటిఫికేషన్‌లో ఉన్నత విద్యాశాఖ స్పష్టం చేసింది. ఆన్‌లైన్ దరఖాస్తుల సవరణలకు ఏప్రిల్ 6 నుంచి 8 వరకు అవకాశం ఉంటుంది. రూ.250 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 9వరకు, రూ.500 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 14 వరకు, రూ.2,500 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 18 వరకు, రూ.5 వేల ఆలస్య రుసుముతో ఏప్రిల్ 24 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్థులకు తప్పనిసరిగా 2025 డిసెంబరు 31 నాటికి 16 సంవత్సరాల వయసు నిండి ఉండాలి. గరిష్ఠ వయో పరిమితి అంటూ ఏమీ లేదు. ఇక బీటెక్ డెయిరీ టెక్నాలజీ, అగ్రికల్చర్ ఇంజినీరింగ్, ఫుడ్ టెక్నాలజీతోపాటు బీఎస్సీ అగ్రికల్చర్, వెటర్నరీ సైన్స్, హార్టికల్చర్ కోర్సులకు 2025 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సుల్లో చేరేందుకు ఎస్సీ, ఎస్టీలకు 25, ఇతరులకు 22 సంవత్సరాలు గరిష్ఠ వయోపరిమితి నిర్ణయించారు. మే 2 నుంచి 5 వరకు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. అలాగే ఏప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా పరీక్షలు నిర్వహించనున్నారు. మరోవైపు ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏపీలోని విజయవాడ, కర్నూలు పరీక్ష కేంద్రాలను రద్దు చేస్తూ ఇప్పటికే ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. 15 శాతం నాన్ లోకల్ కోటాలో ప్రవేశాలు పొందేందుకు ఏపీ విద్యార్థులకు ఇకపై అనుమతి లేదని తేల్చి చెప్పింది.



## రూ.1500 కోట్లతో భారీ పెట్టుబడి

(మొదటి పేజీ తరువాయి..)

కావాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణలో నెలకొల్పే పరిశ్రమల్లో స్థానిక యువతకు ప్రాధాన్యతనిస్తూ ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో లెన్స్‌కార్ట్ సంస్థ ప్రపంచంలోనే అతిపెద్ద కళ్లజోడుల తయారీ కేంద్రాన్ని తెలంగాణలో ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా తెలంగాణ బ్రాండ్ అంతర్జాతీయంగా గుర్తింపు పొందుతుందని తెలిపారు. ఈ ప్లాంట్ ఏర్పాటు కోసం గతేడాది డిసెంబర్ 8న తెలంగాణ ప్రభుత్వం మరియు లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య ఒప్పందం కుదిరిందని తెలిపారు. ప్రస్తుతం రాజస్థాన్‌లో లెన్స్‌కార్ట్ అధునాతన కళ్లజోడుల తయారీ యూనిట్ కలిగి ఉన్నప్పటికీ, తెలంగాణలో నిర్మించబోయే ప్లాంట్ ప్రపంచంలోనే అతిపెద్దదిగా నిలవనుందని మంత్రి స్పష్టం చేశారు. అత్యాధునిక సాంకేతికతతో రూపుదిద్దుకోనున్న ఈ ప్లాంట్ రాష్ట్ర పరిశ్రమల ప్రగతికి కొత్త దారులు తెరుస్తుందని, తయారీ రంగంలో తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్లనున్నదని చెప్పారు. రూ.1500 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఈ ప్లాంట్ ద్వారా సుమారు 2వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. దీనికి ప్రభుత్వం తుక్కుగూడ సమీపంలోని రావిర్యాలలో 50 ఎకరాలు కేటాయించిందని మంత్రి తెలిపారు. ఈ ప్లాంట్ నిర్మాణం రెండేళ్లలో పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, నాలుగేళ్లలో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు మొదలవుతాయని వెల్లడించారు. ఇక్కడ తయారయ్యే కళ్లజోడు ఉత్పత్తులను జపాన్, సింగపూర్, థాయ్‌లాండ్, తైవాన్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, మలేషియా, వియత్నాం, యూఏఈ, సౌదీ అరేబియా వంటి దేశాలకు ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు రాబట్టడంతోపాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను పెంచుతుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

## బిజెపితో బిఆర్ఎస్ చీకటి ఒప్పందం

**- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బయటపడిందన్న మల్లు రవి**

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 6: గెలుపునకు మేమందరం బాధ్యత తీసుకున్నాం.. ఓటమి కూడా సమిష్టి బాధ్యత అని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. బీజేపీ- బీఆర్ఎస్ పార్టీల చీకటి ఒప్పందంలో భాగంగా బీఆర్ఎస్ పూర్తిగా బీజేపీ అభ్యర్థులకు సపోర్ట్ చేసిందని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ హవా చూపిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ సభ్యుల ఓటమిపై ఎంపీ మల్లు రవి ఢిల్లీలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవక పోగా, డిపాజిట్లు పోగొట్టుకున్నారని విమర్శించారు. బీజేపీ ఎమ్మెల్సీల సంఖ్య 3 కు పెరిగిందని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వానికి, ప్రజలకు ఒరిగేది ఏం లేదని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ ఫలితాలు చూపించి సంబురాలు చేస్తుంటే, ఆశ్చర్యంగా ఉందన్నారు. 'బీఆర్ఎస్ నేతలపై ఉన్న కేసుల విషయంలో భయపెట్టి, రహస్య ఒప్పందం చేసుకున్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇతర ఎన్నికలకు సంబంధం ఉండదు. స్థానిక సంస్థల ఎన్నికలకు, ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధం లేదు. రెండు సీట్లు రాగానే, బండి సంజయ్, కిషన్ రెడ్డిలు అన్ని మేమే గెలుస్తాం అంటున్నారు. ఇప్పుడు ఎన్నికలు పెడితే 100 సీట్లల్లో కాంగ్రెస్ గెలుస్తుంది. ఎమ్మెల్యేల కోటాలో కచ్చితంగా సామాజిక న్యాయం ఉంటుంది. ఇన్‌ఛార్జీలు ఎవరు వచ్చినా అందరిది కాంగ్రెస్ సిద్ధాంతమే. గాంధీ సిద్ధాంతాలను మీనాక్షి నటరాజన్ అనుసరిస్తున్నారు.' అని ఎంపీ మల్లు రవి వ్యాఖ్యానించారు.

## ప్రధాని మోదీ
# సమావేశాలకే పరిమితం

- అమెరికా బెదిరింపులకు దిగడం సరికాదు
- ఇతర దేశాల సంపదను కొల్ల గొట్టేందుకు యత్నిస్తోంది
- అమెరికా చర్యలు భారతీయులకు ముప్పా
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 6: సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అమెరికాలో తాజా పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, "ప్రధాని మోదీ వివిధ దేశాధినేతలతో సమావేశాలకే పరిమితం అవుతున్నారు. అయితే, ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన దేశంగా ఉన్న అమెరికా తన ప్రవర్తనను మార్చుకోవాలి. ఇతర దేశాల సంపదను ఆక్రమించేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని అనిపిస్తోంది. ఇటీవల ఎలాన్ మాస్క్‌తో జరిగిన డిబేట్ సందర్భంగా ట్రంప్ ప్రవర్తన విధిరౌడీలా ఉంది. ప్రపంచవ్యాప్తంగా ట్రంప్‌కు వ్యతిరేఖత పెరుగుతోంది. ఈ పరిస్థితిని భారత్ మేల్కొని తమ ప్రయోజనాలకు అనుకూలంగా మలుచుకోవాలి. లేదంటే వంద కోట్ల మంది భారతీయుల భవిష్యత్తును అమెరికా ప్రభావితం చేసే అవకాశం ఉంది. పెట్టుబడిదారులంతా ఏకం అయ్యే ప్రమాదం ఉంది. దీనిపై చంద్రబాబు నాయుడు స్పందించి, మోదీ ద్వారా ట్రంప్‌తో చర్చించేందుకు కృషి చేయాలి" అని నారాయణ వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, అమెరికా అక్రమంగా నివసిస్తున్న భారతీయులను స్వదేశానికి పంపిస్తోంది. ఇప్పటికే వందలాది మంది భారతీయులను మిలిటరీ విమానాల్లో తరలించారు. ఈ అంశంపై ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. దేశ భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అక్కడి ప్రభుత్వం భావిస్తోంది" అని పేర్కొన్నారు.

## కవితకు అహంకారం తగ్గలేదు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 6: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కవితకు ఇంకా దొరల అహంకారం తగ్గలేదని అన్నారు. తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిందని... రాష్ట్ర ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారనే విషయం ఎన్నికల ఫలితాలతో రుజువయిందని చెప్పారు. తరచూ బీజేపీని, ఎన్నికల సంఘాన్ని విమర్శించే నాయకులకు ఈ ఎన్నికలు గుణపాఠమని అన్నారు. ఈవీఎంలపై విమర్శలు గుప్పించే నేతలు... ఇప్పుడు బ్యాలెట్ పేపర్లతో జరిగిన ఎన్నికల ఫలితాలకు ఏం సమాధానం చెబుతారని ఎద్దేవా చేశారు. మరోవైపు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో తెలంగాణలో బీజేపీ శ్రేణులు జోష్ లో ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. రాబోయే అన్ని ఎన్నికల్లో విజయం సాధించాలనే పట్టుదలతో శ్రేణులు ఉన్నాయి. ముఖ్యంగా త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ నేతలు వ్యూహరచన చేస్తున్నారు.

# అధికార కాంగ్రెస్‌కు షాక్

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో చతికిలపడ్డ పార్టీ**

**క్షేత్రస్థాయిలో కానరాని సమన్వయం**

**అధికారం దక్కడంతో ప్రజలకు దూరంగా కార్యకలపాలు**



కరీంనగర్,మార్చి6(నేటి ఫోకస్ న్యూస్):

రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీకి దిమ్మతిరిగే షాక్ తగిలింది. కాంగ్రెస్ కొత్త వ్యవహారాల ఇన్‌ఛార్జ్ ఇక్కడికి వచ్చిన సమయంలోనే ఎమ్మెల్సీ ఫలితాలు చేదు అనుభవాన్ని చూపాయి. కాంగ్రెస్ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని, నటనలు చేయొద్దని హెచ్చరిస్తున్న నేపథ్యంలోనే రెండు ఎమ్మెల్సీలను బిజెపి కైవసం చేసుకుంది. ఇది ఓ రకంగా అధికార కాంగ్రెస్‌కు హెచ్చరిక లాంటిది.

ఉత్తర తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా భావించే ఈ ఎన్నికల్లో రెండు స్థానాలను బిజెపి ఎగురేసుకు పోయింది. గ్యాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీలను రెండూ బిజెపి ఖాతాలో పడ్డాయి. ఇది ఓ రకంగా విద్యావంతుల్లో కాంగ్రెస్ పట్ల నిరసనలకు నిదర్శనంగా చూడాలి. ఉద్యోగాల భర్తీపై నిరుద్యోగుల్లో ఉన్న నిసనగా చూడాలి.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో బిజెపి అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్ ఎమ్మెల్సీలో మల్క కొమురయ్యలు విజయం సాధించారు. ఉమ్మడి కరీంనగర్–ఆదిలాబాద్–నిజామాబాద్–మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాన్ని ఆరేళ్ల క్రితం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నెగ్గిన కాంగ్రెస్‌కు ఇప్పుడు అధికారంలో ఉన్నా ఎదురుదెబ్బ తగిలింది. సిటింగ్ స్థానం కావడం... రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉన్నందున తప్పనిసరిగా గెలిచి తీరాలని అధిష్ఠానం పీసీసీకి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు దిశానిర్దేశర చేసినా చివరికి ఓటమి తప్పలేదు. త్వరలో మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల్లో నియామకాలు, పీసీసీ కార్యవర్గంలో పదవుల పంపకం ఉంటుంది కాబట్టి ఆశావహులు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనిచేస్తారని తొలుత అందరూ భావించారు. కానీ వారు కూడా పెద్దగా క్షేత్రస్థాయిలో తిరగలేదు. అలాగే అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు వచ్చే మెజార్టీనే ఎమ్మెల్యేల పనితీరుకు గీటురాయిగా పరిగణిస్తామని పార్టీ ముందే అంతర్గతంగా చెప్పినా ఫలితం లేకపోయింది. కాంగ్రెస్‌ను దెబ్బ కొట్టాలని భాజపాకు పరోక్షంగా మద్దతు ఇచ్చేందుకు భారాస లోపాయికారీ ఒప్పందం చేసుకుందని తాము ముందే పలుమార్లు చెప్పినా ఈ వ్యూహాన్ని ఛేదించేందుకు క్షేత్రస్థాయిలో పక్కా ప్రణాళికతో పనిచేయలేదని అధికార పార్టీ నేతలు పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సొంత జిల్లా నిజామాబాద్‌లో సైతం నేతలు సరిగా పనిచేయలేదు. పైగా ఆయన పీసీసీ పగ్గాలు చేపట్టిన తరవాత నేరుగా జరిగిన తొలి ఎన్నిక ఇది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యోగాల భర్తీ వంటి అంశాలను పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు ఓటర్ల దగ్గరకు వెళ్లి చెప్పి ఆకట్టుకోలేకపోయారు. ఓటర్లంతా పట్టభద్రులు కావడంతో వారిని ఆకట్టుకోవడానికి ప్రత్యర్థులు సోషల్ మీడియాలో ప్రచారాన్ని ప్రధాన అస్త్రంగా వినియోగించుకుంటే కాంగ్రెస్ నేతలు ఈ విషయంలో పట్టనట్లు వ్యవహరించారనే విమర్శలున్నాయి. అభ్యర్థి ఎంపికలో జాప్యం జరగడం, ముందు నుంచి అనుకున్నవారికి కాకుండా చివరి క్షణంలో మరొకరికి టిక్కెట్ ఇవ్వడం కూడా పార్టీకి నష్టం కలిగించిందన్న విమర్శలు ఉన్నాయి. పోలింగ్‌కు కొద్దిరోజుల ముందు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా వెళ్లి మూడు చోట్ల సభలు పెట్టినా ఫలితం దక్కలేదు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ భారాస ఈ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండటంతో కాంగ్రెస్, భాజపాల మధ్య ద్విముఖ పోరు గురించే ఎక్కువగా చర్చ జరిగింది. కానీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ గట్టి పోటీనివ్వడం కాంగ్రెస్‌ను దెబ్బతీసింది. వాస్తవానికి ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ తనకే వస్తుందని హరికృష్ణ చాలా ముందు నుంచే క్షేత్ర స్థాయిలో పనిచేశారు.

చివరిక్షణంలో నరేందర్‌రెడ్డిని తెరపైకి తేవడంతో హరికృష్ణ బీఎస్పీ నుంచి బరిలోకి దిగడం కాంగ్రెస్‌కు ప్రతికూలంగా మారింది. హరికృష్ణకు టికెట్ ఇవ్వాలని కోరిన కొందరు కాంగ్రెస్ నేతలు పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి విజయానికి కష్టపడి పనిచేయలేదని తెలుస్తోంది. ఉద్యోగులకు, రిటైరైన వారికి బిల్లుల చెల్లింపులు రాష్ట్ర ప్రభుత్వం బాగా ఆలస్యం చేస్తుండటం కూడా విద్యావంతుల్లో అసంతృప్తి ఉన్నట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి. ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గం 15 జిల్లాలు, 42 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉంది. ఈ జిల్లాల పరిధిలో కాంగ్రెస్ పార్టీకి ముగ్గురు మంత్రులు, నలుగురు ఇంఛార్జి మంత్రులు, 23 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. పైగా భారాసకు చెందిన కొందరు ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్‌కు మద్దతిచ్చారు. నేరుగా ఎమ్మెల్యేలు లేని అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ ఇంఛార్జులను సైతం నియమించింది. ప్రధాన ప్రత్యర్థి భాజపాకు నలుగురు ఎంపీలుండటం, వారిలో ఒకరు కేంద్ర మంత్రి అయినందున గట్టిగా పోరాడతారని, దాన్ని దృష్టిలో పెట్టుకుని ఎక్కడికక్కడ పార్టీ స్థానిక శ్రేణులతో కలసి వ్యూహం రచించాలని సీఎం రేవంత్‌రెడ్డి ముందే సూచించారు. కానీ క్షేత్రస్థాయిలో చాలామంది ఆ మేరకు శ్రద్ధతో పనిచేయలేదు. ఈ ఎన్నికలతో ఓ రకంగా అధికార పార్టీకి హెచ్చరిక లాంటిది. మంత్రులు విమర్శలకే పరిమితం అవుతున్నారు. పనులు జరగడం లేదు. మూసపద్ధతిలో పాలన సాగిస్తున్నారు. ఇచ్చిన హామీలు పక్కన పెట్టినా, రోజువారీ కార్యక్రమాలు సజావుగా సాగడం లేదన్న విమర్శలు ఉన్నాయి.



## బీజేపీ ఎమ్మెల్సీకి ప్రధాని అభినందనలు

న్యూఢిల్లీ,మార్చి6(నేటి ఫోకస్ న్యూస్):

తెలంగాణలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయంతో కొత్తగా ఎన్నికైన మల్క కొమరయ్య, అంజిరెడ్డిని ప్రధాని మోదీ అభినందించారు. బీజేపీకి మద్దతుగా నిలిచిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలతో కలిసి పనిచేస్తున్న తమ పార్టీ కార్యకర్తలను చూసి గర్విస్తున్నానన్నారు. కరీంనగర్–ఆదిలాబాద్–నిజామాబాద్–మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గపు ఎమ్మెల్సీలుగా బీజేపీ అభ్యర్థులు చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమరయ్య విజయం సాధించారు. కొమరయ్య విజయం రెండు రోజుల క్రితమే ఖరారుకాగా, పట్టభద్రుల ఫలితం బుధవారం వెలువడింది. కాగా, గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో ఫలితం తేలకపోవడంతో.. రెండో ప్రాధాన్య ఓట్లతో అంజిరెడ్డి గెలుపొందారు. రెండు రోజుల పాటు జరిగిన కౌంటింగ్ ప్రక్రియ అడుగడుగునా ఉత్కంఠ రేపింది. బీజేపీ–కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య 'నువ్వానేనా' అన్నట్టుగా గెలుపు దోబూచులాడింది. ఉమ్మడి నాలుగు జిల్లాల్లో పట్టభద్రుల స్థానానికి మొత్తం 2,52,029 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 28,686 ఓట్లు చెల్లలేదు.వీటిలో 75,675 బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి, 70,565 కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి, 60,419 ఓట్లు బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు వచ్చాయి. నిబంధనల ప్రకారం మొదటి ప్రాధాన్యతలోనే 1,11,672 ఓట్లు పొందిన అభ్యర్థిని విజేతగా ప్రకటించాలి. కానీ మొదటి ప్రాధాన్యంలో ఏ అభ్యర్థికి కూడా అన్ని ఓట్లు రాలేదు. దీంతో రెండో ప్రాధాన్య ఓట్లు లెక్కించారు. మొత్తం 56 మంది పోటీచేయగా, రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కించేందుకు గాను 54 మందిని ఎలిమినేట్ చేస్తూ వచ్చారు. చివరకు బీజేపీ అభ్యర్థికే అత్యధిక ఓట్లు వచ్చాయి. గెలుపు కోటాకు అవసరమైన ఓట్లు రాకపోయినా 5వేల పైచిలుకు ఓట్ల ఆధిక్యం ఉండడంతో మూడో ప్రాధాన్యానికి వెళ్లకుండా అంజిరెడ్డి గెలిచినట్టు అధికారులు ప్రకటించారు.



## బంగారం.. బంగారమవుతోంది

**అందనంతగా రోజురోజుకూ పెరుగుదల**

**పదిగ్రాములు లక్షకు చేరడం ఖాయమంటున్న విశ్లేషకులు**

**పెళ్లిళ్ల సీజన్‌లో మరింత భారంగా ధరల పెరుగుదల**

న్యూఢిల్లీ,మార్చి6(నేటి ఫోకస్ న్యూస్):

బంగారం..బంగారమవుతోంది. అందనంతగా రోజురోజుకూ ధరల పెరుగుదల కలవరానికి గురిచేస్తోంది. పదిగ్రాములు లక్షకు చేరడం ఖాయమంటున్న విశ్లేషకుల మాటలతో మరింత ఆందోళన వ్యక్తం అవుతోంది. పెళ్లిళ్ల సీజన్‌లో మరింత భారంగా ధరల పెరుగుదల సామాన్యులకు భారంగా మారింది. ఇలా బంగారం, వెండి ధరలు అడ్డూఅదుపు లేకుండా పెరుగుతున్నాయి. గత మూడు నెలల్లోనే బంగారం ధరలు అమాంతంగా పదివేలకు పైగా పెరిగాయి. దీంతో దాని దూకుడు ఎలా ఉందో గమనించవచ్చు. శుభకార్యాలు, పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో బంగారం ధరలు రోజు రోజుకు ప్రజలకు అందనంతగా పెరుగుతున్నాయి. బంగారం ధర పెరగడానికి అంతర్జాతీయ పరిణామాలు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. కాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారీఫ్‌హెచ్చరికలు, ఆర్‌బీఐ వడ్డీ రేట్ల కోత, ఫెడ్? వడ్డీ రేట్లు వంటి అంశాలు పసిడి ధరల్లో హెచ్చుతగ్గులకు కారణమవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. అయినప్పటికీ బంగారం ధర భారీగా పెరిగిన నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో బంగారు ఆభరణాలు కొనుగోలు చేయడం తప్పనిసరి అవుతోంది. ప్రధాన నగరాలలో బంగారం ధరలు ఎలా అటుఇటుగా ఒకే రేట్లను పలుకుతున్నాయి. హైదరాబాద్‌లో ప్రస్తుతం 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 80,660గా ఉంది. 24 క్యారెట్ల పసిడి ధర రూ. 87,990గా నమోదైంది. విజయవాడలో సైతం ఈ రేట్లే కొనసాగుతున్నాయి. విశాఖపట్నంలో కూడా ధరలు ఇలాగే ఉన్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల పసిడి ధర 10 గ్రాములు రూ. 80,810 ఉండగా.. 24 క్యారెట్ల బంగారం ధర రూ. 88,140గా ఉంది. కోల్‌కతాలో ప్రస్తుతం 22 క్యారెట్ల పసిడి ధర రూ. 80,660 పలుకుతోంది. 24 క్యారెట్ల గోల్డ్.. 87,990గా

ఉంది. ముంబై, బెంగళూరు, కేరళలోనూ ఇవే రేట్లు కొనసాగుతున్నాయి. చెన్నైలో 22 క్యారెట్ల ధర 10 గ్రాములు రూ. 80,660 ఉండగా, 24 క్యారెట్ల పసిడి ధర 10 గ్రాములు రూ. 87,990గా ఉంది. అలాగే పూణెలో 22 క్యారెట్ల గోల్డ్ రూ. 80,660 ఉండగా.. 24 క్యారెట్ల పసిడి రూ. 87,990గా నమోదైంది. అహ్మదాబాద్?లో.. 22 క్యారెట్ల ధర రూ. 80,710 కాగా.. 24 క్యారెట్ల పసిడ ధర రూ. 88,040గా కొనసాగుతోంది. భువనేశ్వర్ 22 క్యారెట్ల బంగారం ధర రూ. 80,660.. 24 క్యారెట్ల పసిడి ధర రూ. 87,990గా ఉంది. దేశంలో వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. ప్రస్తుతం కేజీ వెండి ధర రూ. 100 తగ్గి రూ. 97,900 వద్ద కొనసాగుతోంది. క్రితం రోజు ఈ ధర రూ. 98,000గా ఉండేది. కాగా.. హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ. 1,06,900గా ఉంది. కోల్‌కతాలో రూ.? 99,400, బెంగళూరులో రూ. 97,900గా ఉంది. బంగారు పదిగ్రాముల ధరల లక్షకు ఏరడం ఖాయమని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## వైభవంగా యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాలు

**గోవర్ధనగిరిధారిగా దర్శనమిచ్చిన నారసింహుడు**

యాదాద్రి,మార్చి6(నేటి ఫోకస్ న్యూస్):

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో 6వ రోజు బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామి వారు గోవర్ధనగిరిధారి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి సింహ వాహనంపై నరసింహుడు ఆలయ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. సృష్టిలోని సకల ప్రాణులపై తన దయాగుణాన్ని ప్రసరింపజేసి అపూర్వమైన తన లీలామహత్యాలతో పరిపూర్ణ అవతారంలో లక్ష్మీనృసింహుడు భక్తజనుల పూజలు అందుకుంటున్నాడు. కాగా దివ్యాలంకారాలతో చేతిలో పిల్లన గ్రోవితో తన లీలామృత మృధుమధుర గానంతో సమ్మోహన పరుస్తూ ఏకశిఖరవాసుడు మురళీకృష్ణుడిగా భక్తజనులకు దర్శనమిచ్చారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన బుధవారం స్వామివారు శ్రీకృష్ణ అలంకరణలో ప్రత్యేక సేవలు అందుకున్నారు. జగత్తులో మంచిని రక్షించి.. చెడును చెండాడి, చేసేది ఎవరైనా, చేయించేది నేనే అంటూ లోక జనులందరికీ జ్ఞానసంపదలు ప్రసాదించిన శ్రీ కృష్ణుడి అలంకరణలో నారసింహుడిని భక్తులు దర్శించి తరించారు. పల్లకిలో మంగళవాయిద్యాల నడుమ తిరువీధుల్లో ఊరేగించారు. భక్తపారాయణుడు జగద్రక్షకుడు శ్రీ మహావిష్ణువు లోకకల్యాణం కోసం అవతరించిన అవతార రూపాల్లో లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో దివ్య వాహన సేవలు అందుకుంటున్నారు. బుధవారం రాత్రి



స్వామి వారు పొన్నవాహన సేవపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్త జనులకు దర్శనమిచ్చారు. పొన్న చెట్టు నీడలో చిలిపి కృష్ణుడు చేసిన రాసలీలా వైభవాలు భాగవతంలో పేర్కొన్న రీతిలో వాహన సేవ ఆహ్లాదకరంగా నిర్వహించారు. పొన్నవృక్షంపై వాసుదేవ స్వరూపమని సకల భక్తులకు ఆశ్రయం కలిగించే వాహన సేవలో స్వామిని భక్తులు దర్శించుకున్నారు. ఉత్సవాలు ప్రధానార్చకులు నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, అర్చక బృందం, వేదపడింతులు, రుత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నర్సింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు, డీఈవో దోర్భల భాస్కరశర్మ, ఏఈవోలు ప్రతాప నవీనకుమార్‌శర్మ, జూశెట్టి క్రిష్ణ, గజ్వేల్లి రమే?షబాబు, రఘు, పర్యవేక్షకులు నాగుల మహే?షగౌడ్, ధీరావత రామరావునాయక్, రాజనబాబు, వాసం వెంకటేశ్వర్లు, దాసోజు నరేష్, రాకేష్ రెడ్డి, ముద్దసాని నరేష్, వేముల వెంకటేశ, ఉద్యోగ పాల్గొన్నారు.



## జానారెడ్డితో సిఎం రేవంత్ భేటీ

**తాజా రాజకీయాలపై ఇరు నేతల చర్చ**

హైదరాబాద్,మార్చి6(నేటి ఫోకస్ న్యూస్):

తాజా రాజకీయాల నేపథ్యంలో అనూహ్యంగా సీఎం రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జానారెడ్డి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా సుమారు అరగంటకు పైగా వీరి మధ్య పలు అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అయితే జానారెడ్డితో సీఎం రేవంత్ భేటీపై ప్రభుత్వ వర్గాలలో ఆసక్తికర చర్చ నడుస్తోంది. జానారెడ్డిని ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా నియమిస్తారని ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం అడిగితే సలహాలు ఇస్తాననని జానారెడ్డి బుధవారం మీడియాతో తెలిపారు. దీంతో వీరి భేటీపై అంతా ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. జానారెడ్డి వ్యాఖ్యల వల్లే.. ముఖ్య సలహాదారు పదవి ఆఫర్ చేయడానికి సీఎం వెళ్లారంటూ చర్చించుకుంటున్నారు. త్వరలో కేబినెట్ విస్తరణ ఉంటుందనే ఊహాగానాలతో ఈ భేటీ ప్రాధాన్యతతలను సంతరించుకుంది. అలాగే ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు తదితర అంశాలపైనా ఇరువురు నేతలు చర్చించివుంటారని అనుకుంటున్నారు.

## ఎస్సీ వర్గీకరణ ముసాయిదా బిల్లుకు కేబినెట్ ఆమోదం

**ముసాయిదా బిల్లుకు తుది మెరుగులు దిద్దాలని సిఎం ఆదేశం**

హైదరాబాద్,మార్చి6(నేటి ఫోకస్ న్యూస్):

ఎస్సీ వర్గీకరణ ముసాయిదా బిల్లుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయ నిపుణుల సలహాలు తీసుకుని ముసాయిదా బిల్లుకు తుది మెరుగులు దిద్దాలని, న్యాయపర చిక్కులు లేకుండా చూడాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో కేబినెట్ భేటీ కొనసాగింది. మాల, మాదిగ, డక్కలి.. ఇలా తెలంగాణలో 59 ఎస్సీ కులాలు ఉన్నాయి. ఆ జాబితాలోని కులాలకు ప్రభుత్వ విద్య, ఉద్యోగాల్లో కొంత శాతం వరకు రిజర్వేషన్ ఉంటుంది. తెలంగాణలో అది 15 శాతం ఉంది. అంటే వందలో 15 ఉద్యోగాలు ఈ కులాలకు చెందిన వారికే ఇస్తారు. అయితే, ఆ జాబితాలోని కులాల మధ్య కూడా అసమానతలు ఉన్నాయి. అందులో కొన్ని కులాలు ముందున్నాయి, మరి కొన్ని కులాలు వెనుకబడి ఉన్నాయని ఆయా కులాల వారు చెబుతూ వచ్చారు. దీనివల్ల ఎస్సీలకు మొత్తంగా ఇచ్చిన రిజర్వేషన్లను కొన్ని కులాలే ఉపయోగించుకుని ముందుకు వెళ్తున్నాయనీ, మిగతా వారు వెనుకబడే ఉంటున్నారనీ ఇతర కులాల వారు ఆరోపిస్తూ వస్తున్నారు. అందుకే ఎస్సీలకు ఇచ్చిన 15 శాతం రిజర్వేషన్‌ను తిరిగి, కులాల మధ్య విభజించి పంచాలనే డిమాండ్ వినిపించింది. ప్రధానంగా రిజర్వేషన్ ఫలితాలు మాలలు వారు ఎక్కువ అనుభవించారు కాబట్టి, ఎస్సీ కులాలను వర్గీకరణ జరపాలంటూ మాదిగలు పోరాడారు. మందకృష్ణ మాదిగ తెలుగునాట ఆ పోరాటంలో ముందు ఉండి అందరిని నడిపించారు.

## అంతుచిక్కని వ్యాధితో 13 మంది మృతి

ఛత్తీస్‌గఢ్,మార్చి6(నేటి ఫోకస్ న్యూస్):



రాష్ట్రంలోఅంతుచిక్కని వ్యాధి కారణంగా సుక్మా జిల్లాలోని ఓ మారుమూల గ్రామంలో నెల రోజుల వ్యవధిలోనే 13 మంది ప్రాణాలు కోల్పోయారు. అప్రమత్తమైన అధికారులు గ్రామంలోని 80 మంది బ్లడ్ శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపారు. ఒడిశా సరిహద్దుకు సమీపంలో ఉన్న చిన్న గ్రామం ధనికొర్తలో ఈ ఘటన వెలుగు చూసింది. గ్రామంలో దాదాపు ప్రతి ఇల్లూ ఈ వ్యాధికి ప్రభావితమైంది. ఈవ్యాధి కారణంగా ఇప్పటి వరకూ 13మంది ప్రాణాలు కోల్పోయారు. వీరి మరణానికి ఖచ్చితమైన కారణం మాత్రం తెలియరాలేదు. బాధితులంతా వారి మరణానికి ముందు తీవ్రమైన ఛాతీ నొప్పి, నిరంతర దగ్గుతో బాధపడినట్లు తెలిసింది. అప్రమత్తమైన ఆరోగ్య శాఖ అధికారులు ఆ గ్రామానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి స్థానికులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. 80మంది స్థానికుల బ్లడ్ శాంపిల్స్‌ను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. ఈ అంతుచిక్కని వ్యాధితో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అయితే సుక్మా చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కపిల్ దేవ్ కశ్యప్ మాత్రం.. ఈ మధ్య కాలంలో ఐదు మరణాలే నమోదైనట్లు చెప్పారు. వృద్ధాప్య సంబంధిత కారణాలతో జిల్లా ఆసుపత్రిలో ముగ్గురు వ్యక్తులు మరణించినట్లు తెలిపారు. మరో ఇద్దరి మరణాలకు గల కారణాలపై దర్యాప్తు జరుగుతోందని పేర్కొన్నారు.

# పైరసీపై ఉద్యమం చేద్దాం: దిల్‌రాజు



తెలుగు సినిమాలు విడుదల రోజే పైరసీ అవుతున్న సందర్భంగా వాటిని అరికట్టేందుకు ఒక ఉద్యమం రావాలని ప్రముఖ తెలుగు సినిమా నిర్మాత దిల్ రాజు అన్నారు. దిల్ రాజ్ నిర్మాణంలో వచ్చిన బ్లాక్ బస్టర్ చిత్రం 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు'. విక్టరీ వెంకటేశ్, సూపర్ స్టార్ మహేశ్ బాబు, ప్రకాశ్ రాజ్ జయసుధ తదితరులు ప్రధాన పాత్రల్లో వచ్చిన ఈ చిత్రం 2013న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్ అందుకుంది. అయితే ఈ సినిమా వచ్చి 12 ఏండ్లు అవుతున్న సందర్భంగా రీ రిలీజ్ చేస్తున్నారు మేకర్స్. మార్చి 07న ఈ సినిమాను రీ రిలీజ్ చేస్తుండగా.. ఈ సందర్భంగా దిల్ రాజు ప్రెస్‌మీట్ నిర్వహించారు. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు వచ్చి 12 ఏండ్లు అవుతున్న ఈ సినిమాను ఇంకా ఆదరిస్తున్నారు. రీరిలీజ్ ఓపెనింగ్స్ చూస్తుంటే ఆనందంగా ఉంది. హైదరాబాద్‌లో పది థియేటర్లు హౌస్‌ఫుల్స్ అయిపోయాయి. ఆంధ్రాలో కూడా మంచి ఓపెనింగ్స్ వస్తాయి. ఈ వసూళ్లు చూస్తుంటే మాలో కొత్త ఎనర్జీ వస్తుంది. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు చిత్రంలో యాడ్ చేయడానికి ఎక్స్ ట్రా ఫుటేజ్ చాలా ఉంది. కానీ అలాంటి ప్రయోగాలు ఏమీ చేయట్లేదు. ఇంతకు ముందు ఉన్న సినిమాను అలాగే విడుదల చేస్తున్నాం. మంచి చిత్రాలు ఎన్నిసార్లు రిలీజ్ చేసినా చూసేందుకు ప్రేక్షకులు సిద్ధంగా ఉన్నారంటూ దిల్ రాజ్ తెలిపాడు. ఈ క్రమంలోనే తెలుగు సినిమాను భూతంలా పీడిస్తున్న పైరసీకి సంబంధించి స్పందించారు దిల్ రాజు. పైరసీని అరికట్టేందుకు ఒక ఉద్యమం రావాలని దిల్ రాజు అన్నారు. పైరసీని అరికట్టేందుకు మనం అందరం కలిసి ఒక ఉద్యమం లాంటిది తీసుకురావాలి. చాలామంది నిర్మాతలు తమ సినిమా విడుదల సమయంలో మాత్రమే ఈ సమస్య గురించి మాట్లాడతారు, కానీ ఆ తర్వాత అందరూ దాన్ని మర్చిపోతారు. అందుకే ఈ సమస్య ఎక్కడ వేసిన గొంగళిలా అక్కడే ఉంటోంది అంటూ చెప్పుకోచ్చాడు దిల్ రాజు. పైరసీ వల్ల సినిమా పరిశ్రమకు కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతోందని, కొత్త సినిమాలు విడుదలైన కొద్ది గంటల్లోనే అక్రమ వెబ్‌సైట్‌లలో అందుబాటులోకి వస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉద్యమం విజయవంతం కావాలంటే, నిర్మాతలతో పాటు దర్శకులు, నటులు, డిస్ట్రిబ్యూటర్లు మరియు ప్రేక్షకులు కూడా సహకరించాలని దిల్ రాజు అభిప్రాయపడ్డారు.

# కమల్, అజిత్‌ను ఫాలోఅవుతున్న నయన్



ఒకప్పుడు నటీనటులకు తమకు పెద్దవారు ఇచ్చే బిరుదులను ఆదరంగా స్వీకరించి, గొప్పగా చెప్పుకునే వారు. ఆ తర్వాత అభిమానులు ప్రేమతో ఇచ్చే బిరుదులనూ స్వీకరించడం మొదలు పెట్టారు. కొందరైతే దర్శక నిర్మాతలకు సూచన చేసి మరీ బిరుదులను పొందిన వారూ ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం సినిమా రంగంలో సేవ చేసిన వారికి గుర్తింపుగా పద్మశ్రీ పురస్కారాలను ప్రకటిస్తూ ఉంటుంది. అయితే అది బిరుదు కాదనే విషయాన్ని స్పష్టం చేస్తుంది. సినిమా టైటిల్స్ కార్డుల్లో పేరు ముందు పద్మశ్రీ అనే పదాన్ని బిరుదులా ఉపయోగించడం నిషిద్ధం. కావాలనుకుంటే సదరు వ్యక్తి 'పద్మశ్రీ పురస్కార గ్రహీత' అని పేరు ముందు వేసుకోవచ్చు. అయితే... ప్రభుత్వం ఇచ్చే పద్మ పురస్కారాల కంటే... స్టార్ హీరోలకు, హీరోయిన్లకు, దర్శకులకు అభిమానులు, సినిమా ఇండస్ట్రీ వాళ్ళు ఇచ్చే బిరుదులంటే భలే ఇష్టం. ఎలాంటి సంకోచం లేకుండా ఆ బిరుదులను సినిమా టైటిల్స్ కార్డుల్లోనూ, మీడియాకు ఇచ్చే ప్రెస్ నోట్స్ లోనూ వాడేసుకుంటారు. ఇటీవల ఇలాంటి బిరుదల పట్ల, అభిమానులు తమ పేర్ల ముందు చేర్చుతున్న విశేషణాల పట్ల కొందరు నటీనటులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. తమను పేరుతో సంభోదిస్తే చాలని, ప్రత్యేకమైన బిరుదలను పెట్టవద్దని బహిరంగంగా అభిమానులను వేడుకుంటున్నారు. ప్రముఖ నటుడు, దర్శక నిర్మాత కమల్ హాసన్‌ను కొంతకాలంగా ఉళగనాయకన్ అనే పేరుతో సంభోదిస్తున్నారు.

# 'నాగ్'తో పూజా హెగ్డే ఊర మాస్ సాంగ్

ఒకప్పుడు టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన పూజా హెగ్డే ఆ తర్వాత డల్ అయింది. వరుస పరాజయాలతో ఆమెకి అవకాశాలే కరువయ్యాయి. స్టార్ హీరోలతో కలిసి పని చేసిన పూజా హెగ్డే ఇప్పుడు చిన్న హీరోలతో పని చేసేందుకు సిద్ధమైనట్టు తెలుస్తుంది. అయితే పూజా హెగ్డేకి ఇప్పుడు తెలుగులో పెద్దగా అవకాశాలు లేవు. తమిళంలో మాత్రం రెండు సినిమాలు చేస్తుంది. అవి రెండూ భారీ మూవీస్ కావడం విశేషం. సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా రూపొందుతున్న  కూలీలో స్పెషల్ సాంగ్ కూడా చేయబోతున్నట్టు టాక్ వినిపిస్తుంది. ఈ సినిమాలు పూజా హెగ్డేకి ఎంత వరకు ప్లస్ అవుతాయా అని అభిమానులు చర్చించుకుంటున్నారు. పూజా హెగ్డే తెలుగులో ప్రభాస్, ఎన్టీఆర్, మహేష్ బాబు, అల్లు అర్జున్, రామ్ చరణ్, నాగచైతన్య, అఖిల్, వరుణ్ తేజ్ వంటి హీరోలతో నటించింది. క్రేజ్ ఉన్న సమయంలో రెచ్చిపోయింది. రెమ్యునరేషన్ కూడా భారీగానే పెంచేసింది. వచ్చిన అవకాశాలని దేనిని వదులుకోలేదు. అయితే ఇందులో కొన్ని దెబ్బ కొట్టడంతో పూజా ఇప్పుడు రూట్ మార్చింది. కంటెంట్ ఉన్న సినిమాలు, బలమైన పాత్రలే చేయాలని అనుకుంటుందట. ఇప్పుడు కోలీవుడ్‌లో పూజా నటిస్తున్న విజయ్..జన నాయగన్, సూర్య.. రెట్రో.. చిత్రాలు కూడా అలాంటివే అని తెలుస్తుంది. అయితే క్రేజ్ ఉన్న సమయంలోనే పూజా హెగ్డే రంగస్థలంలో జిగేల్ రాణి అనే స్పెషల్ సాంగ్‌కి చిందులేసింది. ఆ పాట థియేటర్లని ఊపేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు దాన్ని మించి..కూలీలో ఐటెమ్ సాంగ్ ఉంటుందట. అందులో కింగ్ నాగార్జునతో ఈ అమ్మడు ఆడిపాడనుందని అంటున్నారు. ఊరమాస్‌గా ఈ పాట ఉండనున్నట్టు తెలుస్తుండగా, ఇందులో నాగ్‌తో కలిసి పార్టీలో తెగ రచ్చ చేయనుందట. ఇందులో పూజా లుక్ కూడా అదిరిపోయేలా ఉంటుందని అంటున్నారు. కాగా, రజనీకాంత్ కూలీలో నాగార్జున కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. నెగటివ్ షేడ్ ఉన్న రోల్ అని సమాచారం. ఇదిలా ఉంటే ఇప్పటికే నాగ్ తనయులు నాగచైతన్యతో ఒక లైలా కోసం, అఖిల్‌తో మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ చిత్రాల్లో నటించిన పూజా హెగ్డే ఇప్పుడు నాగార్జునతో చిందులేయడం హాట్ టాపిక్‌గా మారింది.







# అకీరానందన్ తొలి మూవీ.. 'సితార' కాంబో?

## డిమాండ్ చేస్తున్న ఫ్యాన్స్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ రాజకీయాలలోకి వచ్చాక సినిమాలపై ఫోకస్ తక్కువగా పెడుతున్నాడు. దీంతో పవన్ తనయుడు అకీరాని హీరోగా చూడాలని అభిమానులు అనుకుంటున్నారు. అకీరా నందన్ తొలిసినిమా ఎప్పుడు ప్రారంభం అవుతుందని కొన్నాళ్లుగా జోరుగా డిస్కషన్ జరుగుతుంది. అయితే పవన్ తన వారసుడు అకీరా నందన్‌ను అతి త్వరలో లాంచ్ చేసే పనిలో నిమగ్నమయ్యారని ఫిల్మ్ నగర్‌లో టాక్ వినిపిస్తోంది. అకీరా నందన్‌ను ప్రముఖ నిర్మాత అశ్వినీ దత్ లాంచ్ చేయనున్నట్టు సమాచారం. సూపర్ స్టార్ మహేశ్ బాబు, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తేజ్‌లను కూడా ఇండస్ట్రీకి పరిచయం చేసింది అశ్వినీ దత్ కాగా, ఇప్పుడు అకీరా నందన్ బాధ్యతలను కూడా ఆయనే తీసుకున్నారని తెలుస్తోంది. అయితే అకీరా నందన్ హీరో అయితే ఆయన సరసన నటించే కథానాయిక ఎవరు అయితే బాగుంటుందనే చర్చ కూడా మొదలైంది.. అఖీరానందన్ ఎప్పుడు ఇండస్ట్రీలోకి హీరోగా ఎంట్రీ ఇచ్చిన సరే హీరోయిన్ మాత్రం మహేష్ బాబు కూతురు సీతార అయి ఉండాలని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. ఇండస్ట్రీలో మొదటి నుంచి పవన్ కళ్యాణ్, మహేష్ బాబు మధ్య మంచి స్నేహ బంధం ఉంది. ఈ క్రమంలో అకీరా సరసన సితారని హీరోయిన్‌గా పరిచయం చేయడానికి మహేష్ ఎలాంటి అభ్యంతరం తెలపకపోవచ్చు. మరోవైపు సితార కూడా సినీ ఇండస్ట్రీలో తన సత్తా చూపించాలని ఎంతగానో అనుకుంటుంది. మరి అకీరా-సితార జంటగా ఎవరైన సినిమా తీస్తే మాత్రం అది బ్లాక్ బస్టర్ కావడం ఖాయం. ఇది జరుగుతుందా లేదా అనేది చూడాల్సి ఉంది. కాగా,అకీరా నందన్ మొదటి సినిమాకు తమిళ దర్శకుడు విష్ణువర్ధన్ దర్శకత్వం వహించనున్నాడని గత కొద్ది రోజులుగా సినీ వర్గాల్లో చర్చ నడుస్తుంది. పవన్ కళ్యాణ్‌తో 'పంజా' సినిమాను తెరకెక్కించిన విష్ణువర్ధన్, ఇప్పుడు అకీరా నందన్‌ను లాంచ్ చేయడంకి సంబంధించి కూడా పూర్తి క్లారిటీ రావలసి ఉంది.

